ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి


5

ములుగు

ఆదివారం 7 జూలై 2024



నెలకే.. నియామకమా?!





హనుమకొండ, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకుల (గెస్ట్ లెక్చరర్స్) పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సాధారణంగా కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్లను ఒక విద్యాసంవత్సరం మొత్తానికి దృష్టిలో పెట్టుకొని నియమిస్తారు. ఆదేంటోగానీ.. గెస్ట్ లెక్చరర్ల నియామకం విషయంలో ప్రభుత్వం విచిత్రమైన పద్ధతిని అనుసరించింది. కేవలం ఒక నెల రోజుల వరకే రెన్యూవల్ చేసింది. ఇదేమిటంటే ఇంటర్ బోర్డు అధికారుల వద్ద సమాధానం లేదు. నెల రోజుల తర్వాత అయినా వీరి కాలపరిమితిని పొడిగిస్తారా..? అంటే కూడా స్పష్టత లేదు. నెల రోజులు గడిచిన తర్వాత తాము కొనసాగుతామా? లేదా? అన్న ఆందోళనలో గెస్ట్ లెక్చరర్లు ఉన్నారు. వీరు ప్రస్తుతం త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారు.

పదేళ్లుగా..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏళ్లుగా నియామకాలు లేకపోవడం వల్ల అధ్యాపకుల కొరత తీవ్రంగా ఏర్పడగా, ఈ సమస్యను అధిగమించేందుకు గెస్ట్ లెక్చరర్లను తీసుకున్నారు. విద్యార్థులకు సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయడంలో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచడంలో, అలాగే విద్యార్థుల ప్రవేశాలను పెంచడంలో పదేళ్లుగా వీరు కీలక భూమిక పోషిస్తున్నారు. అయితే ప్రతీ విద్యా సంవత్సరం వీరు రెన్యూవల్ కావలసి ఉంటుంది. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి వారిని విధుల్లోకి తీసుకుంటే సకాలంలో సిలబస్ పూర్తికావడంతో పాటు కొత్తగా కళాశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. కానీ ప్రభుత్వం ఆ పని చేయలేదు. తమను విధుల్లోకి తిరిగి తీసుకోవాలని అతిథి అధ్యాపకులు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో దిగి వచ్చిన ప్రభుత్వం.. ఈనెల 31వ తేదీ వరకు మాత్రమే కొనసాగిస్తూ నెల రోజుల కాలపరిమితితో నియమకాలు చేసింది. ఈ మేరకు గత నెల 27న ఉత్తర్వులను జారీ చేసింది. ఈ నిర్ణయం అధ్యాపకులను దిగ్భ్రాంతికి లోను చేసింది.

రెగ్యులర్ దెబ్బ

ఈనెల 5వ వేదీ నుంచి జరుగనున్న రెగ్యులర్ అధ్యాపకుల బదిలీలతో గెస్ట్ లెక్చరర్లు మరో సారి నష్టపోయే పరిస్థితి ఏర్పడనున్నది. ఈ విద్యా సంవత్సరం గెస్ట్ లెక్చరర్లను నెల రోజుల వరకే తీసుకోవడానికి కారణం త్వరలో జరగనున్న లెక్చరర్, జూనియర్ లెక్చరర్ల భర్తీ అయి ఉండొచ్చని భావిస్తున్నారు. కిందటేడు 1,392 లెక్చరర్లు, జూనియర్ లెక్చర్ల పోస్టులకు జరిగిన పరీక్షల దృష్ట్యా త్వరలో చేపట్టనున్న ఈ పోస్టుల భర్తీ దృష్ట్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొని ఉండొచ్చని భావిస్తున్నారు. రెగ్యులర్ లెక్చరర్ల బదిలీలు జరిగితే వారంతా గెస్ట్ లెక్చరర్ల స్థానంలోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో వీరి ఖాళీలు గల్లంతవుతాయి. ఒక వేళ ఈ విద్యాసంవత్సరం వీరి పునర్నియామకం జరిగిన పక్షంలో వేరే వేరే చోటికి వెళ్లాల్సి వస్తుంది.

370 జీవోతో అన్యాయం

గెస్ట్ లెక్చరర్లకు 370 జీవో గొడ్డలిపెట్టుగా మారింది. ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ఈ జీవో వల్ల వీరికి ఎక్కువ నష్టం జరిగింది. వాస్తవంగా గెస్ట్ లెక్చరర్ మల్టీజోనల్ పోస్టుగా పరిగణించాలి. కనీసం జోనల్ పోస్టుగానైనా గుర్తించాల్సి ఉంది. కానీ గత విద్యా సంవత్సరం ఈ పోస్టును జిల్లా పరిధి (విత్ ఇన్ ది డిస్ట్రిక్ట్)కే పరిమితం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రెగ్యులర్ అధ్యాపకులు గెస్ట్ లెక్చరర్ల స్థానంలో బదిలీపై రావడంతో వారు వైదొలగాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనితో చాలామంది అతిథి అధ్యాపకులు ఉద్యోగాలు పోయి నష్టపోవలసి వచ్చింది. ఇలాంటి వారిని కూడా కనీసం ఈ విద్యా సంవత్సరంలో తిరిగి తీసుకోలేదు. దీంతో పాటు ఒకేషనల్ కోర్సుల్లో సెకండ్ పోస్టుల్లో కూడా నియమకాలు చేయలేదు. అయితే జోన్ 1లో మాత్రం ఒకేషనల్ కోర్సుల్లో సెకండ్ పోస్టుల్లో నియామకాలు జరిపిన ప్రభుత్వం.. జోన్ 2లో మాత్రం జరపలేదు. అలా గత విద్యా సంవత్సరంలో గెస్ట్ లెక్చరర్లలో చాలా మంది కొనసాగింపు లేక రోడ్డున పడ్డారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా ఇదే పరిస్థితి పునరావృతమయ్యేట్టు కనిపిస్తోంది.

- అసంబద్ధంగా అతిథి అధ్యాపకుల క్రమబద్ధీకరణ
- నెల రోజుల వరకే నియామకంపై అనిశ్చితి
- ఆ తర్వాత పరిస్థితి ఏమిటని ఆవేదన
- నియామకాల్లో స్పష్టత లేక అయోమయం
- 370 జీవోతో ఇప్పటికే తీవ్రంగా అన్యాయం
- 'విత్ ఇన్ ది డిస్ట్రిక్ట్' ఆంక్షతో గల్లంతైన ఉద్యోగాలు
- నష్టపోతున్న విద్యార్థులు.. గాడితప్పుతున్న ఇంటర్ విద్య

వృత్తికోర్సులకు అధ్యాపకుల కొరత

జూనియర్ కాలేజీల్లో వృత్తి శిక్షణా కోర్సుల్లో విద్యాబోధనకు ఇద్దరేసి లెక్చరర్లు ఉండాలి. మొదటి సంవత్సరానికి ఒకరు, రెండో సంవత్సరానికి మరొకరు ఇన్‌చార్జిగా ఉండాలి. ఒకేషనల్ కోర్సుల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో మూడు థియరీ, మూడు ప్రాక్టికల్స్‌తో పాటు ఇంగ్లీష్, జనరల్ సైన్స్ ఉంటాయి. కిందటేడు అన్ని కాలేజీల్లో ఒక్క గెస్ట్ లెక్చరర్‌తోనే సరిపెట్టారు. రెండో గెస్ట్ లెక్చరర్ పునర్నియమకానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో విద్యార్థులకు బోధన సరిగా జరగక చాలా మంది ఫెయిల్ అయ్యారు. ఈ యేడు ఇప్పటివరకు ఆ ఒక్కరిని కూడా తీసుకోలేదు. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఒకేషనల్ కోర్సులున్న జూనియర్ కాలేజీలకు లెక్చరర్లు లేకపోవడంవల్ల వారు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం గెస్ట్ లెక్చరర్లనన్నా కొనసాగించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఒకేషనల్ కోర్సులు నడుస్తున్న జూనియర్ కాలేజీలు పదిహేనుకు పైగా ఉన్నాయి. ఇందులో 20కిపైగా వృత్తి కోర్సులను బోధిస్తారు.

వెట్టి చాకిరి

రాష్ట్ర వ్యాప్తంగా 1,654 మంది గెస్ట్ లెక్చరర్లు ఉండగా, ఉమ్మడి జిల్లాలో 158 మంది వరకు ఉన్నారు. వీరంతా ఏళ్ల తరబడి పని చేస్తున్నారు. హనుమకొండ జిల్లాలో 9, వరంగల్ జిల్లాలో 10, జనగామ జిల్లాలో 8, మహబూబాబాద్ 6, ములుగు జిల్లాలో 4, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 4 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. గెస్ట్ లెక్చరర్లకు ఇచ్చే వేతనం కూడా తక్కువే. వారికి ప్రస్తుతం నెలకు రూ.28,080 చెల్లిస్తున్నారు. వీరు నెలకు 72 పీరియడ్లు బోధించాలి. పీరియడ్‌కు రూ.390చొప్పున చెల్లిస్తారు. ఒకనెలలో 120 పీరియడ్లు బోధించినా.. 72 పీరియడ్లకే చెల్లిస్తారు. అయితే గెస్ట్ లెక్చరర్లు 72 పీరియేడ్లకే పరిమితం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు, వారి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నెలలో 100 నుంచి 120 పీరియడ్ల వరకు బోధిస్తారు. అతిథి అధ్యాపకుల విధానం 2013 నుంచి అమలులోకి వచ్చింది. అప్పటి నుంచి పని చేస్తున్నా వీరి వేతనం గొర్రెతోక బెత్తెడే చందంగా ఉంది. రెగ్యులర్ లెక్చరర్లకు వేతనాలు రూ.లక్షన్నరకు పైగా ఉన్నా గెస్ట్ లెక్చరర్లకు మాత్రం చెల్లించేది మాత్రం అంతంత మాత్రమే.

మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

జిల్లాస్థాయి కోఆర్డినేషన్ సమావేశంలో కలెక్టర్ దివాకర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూలై 6: ములుగును డెంగీ, మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్యులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవడంతోపాటు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. శనివారం ములుగులోని కలెక్టరేట్‌లో సీజనల్ వ్యాధుల నియంత్రణపై జిల్లాస్థాయి కోఆర్డినేషన్ సమావేశం జరగగా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. చాలా మంది చెరువులు, వాగులు, చెలిమల ద్వారా వచ్చే నీటిని తాగడం సురక్షితం కాదన్నారు. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగేవిధంగా చూడాలని, పాఠశాలల్లో బ్లీచింగ్ పౌడర్ అందుబాటులో ఉంచాలన్నారు. గొత్తికోయ గూడాల్లో మలేరియా, డెంగీ వ్యాధులను నియంత్రించడానికి ప్రత్యేక అధికారులు, స్థానిక అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తం చేయాలన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో గ్రామాల్లో డ్రైడే నిర్వహించాలని, మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని కలెక్టర్ ఆదేశించారు.

తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ డెంగీ, మలేరియా కేసులకు తగిన చికిత్స అందించి పరిస్థితిని బట్టి జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేయాలన్నారు. జిల్లా ఆస్పత్రిలో కలుషిత నీటి ద్వారా వచ్చే వ్యాధులు, కీటకజనిత వ్యాధులకు సంబంధించి వేర్వేరు వార్డులను నిర్వహించాలన్నారు. జిల్లాలోని ఆరోగ్యశాఖ, ఉమెన్‌హెల్త్ అండ్ చైల్డ్, పంచాయతీరాజ్, తదితర శాఖల సిబ్బంది కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు సమన్వయంతో పనిచేస్తూ రాబోయే రోజుల కార్యాచరణను సిద్ధం చేసుకోవాలన్నారు. ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.జగదీశ్వర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌లాల్, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ పోరిక రవీందర్, ఏటూరునాగారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ జినుకల దుర్గారావు, ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కేటీపీపీలో విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్

- 600 మెగావాట్ల ప్లాంటులో ట్యూబ్ లీకేజీతో షట్‌డౌన్



కేటీపీపీ వ్యూ

గణపురం, జూలై 6 : గణపురం మండలం చెల్పూరులోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు రెండో దశ 600 మెగావాట్ల ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. శుక్రవారం రాత్రి ప్లాంటులో ట్యూబ్ లీకేజీ కావడంతో ఇంజనీరింగ్ అధికారులు గ్రిడ్‌లో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. అయితే దేశంలోనే ఉన్న థర్మల్ ప్రాజెక్టుల్లో కేటీపీపీ 203 రోజుల పాటు రెండో దశ నాన్ స్టాప్ ప్రొడక్షన్ చేసి రికార్డు సృష్టించింది. ఈ నేపథ్యంలోనే ట్యూబ్ లీకేజీ సమస్య రావడంతో విద్యుత్ ఉత్పత్తిని బ్రేక్ చేశారు. ప్రాజెక్టు లో లీకేజీకి మరమ్మతులను అధికారులు చేపట్టారు. కాగా, మొదటి దశ 500 మెగావాట్లు ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తి పూర్తి స్థాయిలో కొనసాగుతుంది.

రుణాలు రికవరీ చేయండి

డిపాజిట్లపై విస్తృత ప్రచారం జరగాలి

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూలై 6: పెండింగ్‌లో ఉన్న రుణాలను త్వరగా రికవరీ చేయాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు డీసీసీ బ్యాంకు మేనేజర్లను ఆదేశించారు. సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హనుమకొండలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ.. కర్షకమిత్ర, ఎల్‌టీ, డెయిరీ, మార్టిగేజ్ తదితర రుణాలను రికవరీ చేయాలన్నారు. రికవరీ కాని రుణాల విషయంలో చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రుణాలు పొందేవారి చేత రూ.2లక్షల పీఎంజేజేవై, పీఎంఎస్‌బీవై చేయించాలన్నారు. బ్యాంకు డిపాజిట్ల పెరుగుదలపై దృష్టి పెట్టాలని ఈ మేరకు బ్యాంకు కల్పిస్తున్న వడ్డీలు, ఇతర ప్రయోజనాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉషశ్రీ, డీజీఎం అశోక్, ఏజీఎం మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

కలెక్టర్ రాహుల్ శర్మ

పలిమెలలో సంపూర్ణత అభియాన్‌పై అవగాహన ర్యాలీ



సంపూర్ణత అభియాన్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

మహదేవపూర్ రూరల్, జూలై 6 : జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యమని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన యాస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమాన్ని శనివారం పలిమెల మండల కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా దేశ వ్యాప్తంగా నీతిఆయోగ్ 500 బ్లాకులను ఎంపిక చేయగా భూపాలపల్లి జిల్లా నుంచి పలిమెల, మహాముత్తారం మండలాలు ఎంపికయ్యాయన్నారు. ఈ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే ప్రత్యేక నిధుల ద్వారా మూడు నెలల వ్యవధిలో వైద్య, విద్య, సంక్షేమ, వ్యవసాయ, ఉద్యాన, గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయంతో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని అన్నారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉంటేనే నవజాత శిశువులు ఆరోగ్యంగా జన్మిస్తారన్న కలెక్టర్ గర్భ నిర్ధారణ జరిగినప్పటి నుంచి క్రమం తప్పకుండా వైద్యుల సలహాలు, సూచనలు పొందేలా అవగాహన కల్పించాలని అన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా మండలంలోని 22 మహిళా సంఘాలకు రూ.3.30 లక్షల రివాల్వింగ్ ఫండ్ మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పండ్లు, కూరగాయల మొక్కలు పెంచాలని, రక్తహీనత ఉన్నవారిని గుర్తించి పౌష్టికాహారం అందించాలన్నారు. మహిళలు వేధింపులకు గురైతే 181, 19ఏళ్ల లోపు పిల్లలు హింసకు గురైతే 1088 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా సహాయక కేంద్రాలకు సమాచారం ఇవ్వాలని అన్నారు. పలిమెల మండల వ్యాప్తంగా 1850 మంది రైతులు 5వేల ఎకరాల్లో మిర్చి, పత్తి, వరి పంటలను సాగు చేస్తున్నారని తెలిపిన కలెక్టర్ మట్టి నమూనాలను సేకరించి వాటి ఆధారంగా అనువైన పంటలు పండించే విధంగా సూచనలిస్తామని తెలిపారు. అన్ని రంగాల్లో పలిమెల మండలాన్ని అభివృద్ధి చేసేందుకే సంపూర్ణత అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథ మిక పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా మార్చాలని పలువురు కలెక్టర్‌కు దృష్టికి తీసుకురాగా పరిశీలిస్తామని చెప్పారు. మండల పర్యటలో భాగంగా పంకెనలోని కేజీబీవీ పాఠశాలను కలెక్టర్ రాహుల్‌శర్మ తనిఖీ చేశారు. విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా వ్యక్తిగత పరి శుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, యాస్పిరేషనల్ ప్రొఫెషనల్ గాయత్రి, సీపీవో సామ్యూల్, డీఎంహెచ్‌వో మధుసూదన్, డీపీవో నారాణయరావు, డీఆర్‌డీవో నరేష్, ఉద్యాన శాఖ అధికారి సంజీవరావు, వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్, మహిళా సంక్షేమ అధికారి అవంతి, డీఈవో రాజేందర్, పీఆర్ ఈఈ దిలీప్, తహసీల్దార్ హేమ, ఎంపీడీవో శ్రీనివాస్, సీడీపీవో రాధిక పాల్గొన్నారు.

సరస్వతీ బ్యారేజీ పనుల పరిశీలన



బ్యారేజీని పరిశీలిస్తున్న అధికారులు

మహదేవపూర్, జూలై 6: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మండలంలోని అన్నారం వద్ద నిర్మించిన సరస్వతీ బ్యారేజీ మరమ్మతు పనులను శనివారం సీఈ సీడీవో మోహన్‌కుమార్, ఈఈ రఘురాం ఆధ్వర్యంలో బృందం పరిశీలించింది. ఎన్‌డీఎస్‌ఏ సూచన ల మేరకు మరమ్మతులు చేశారా.. లేదా ఇంకా ఏమైనా పనులు చేయాల్సి ఉందా.. అన్న విషయంపై క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. బ్యారేజీలో గతంలో బుంగలు ఏర్పడడంతో పూడ్చడంతోపాటు ఈ ఖరీఫ్ నాటికి నీటిని నిల్వ చేయవచ్చా.. ఎంత వర కు నీటిని చేయవచ్చని పరిశీలన చేశారు. రూ.1.13 కోట్ల నిధులు సద్వినియోగం జరి గిందా.. అన్నదానిపై పరిశీలనచేసి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు. వారి వెంట ఈఎన్‌సీ అనిల్‌కుమార్, సీఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ యాదగిరి ఉన్నారు.

యువత వ్యసనాలకు బానిస కావొద్దు

జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

కాటారం, జూలై 6: యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసై జీవితాన్ని అంధకారం చేసుకోవద్దని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, గంజాయి రవాణా, సేవించే వారిపై పటిష్ఠ నిఘా ఉంటుందని హెచ్చరించారు. కాటారం మండల కేంద్రంలో సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాలతో కలిగే దుష్పరిణామాలపై యువత, గతంలో గంజాయి సేవించిన వారికి అవగాహన, కౌన్సెలింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తల్లిదండ్రుల కష్టాలు, బాధలు గుర్తుంచుకుని క్రమశిక్షణతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. డ్రగ్స్ మహమ్మారి ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న భయంకరమైన వ్యసనమని, దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత యువత, విద్యార్థులతో సహా అందరిపై ఉందని ఉద్ఘాటించారు. గంజాయి, వైట్‌నర్, పంక్చర్ సొల్యూషన్ పీలిస్తే విచక్షణ కోల్పోయి, తాము ఏం చేస్తున్నామో తెలియని దుస్థితిలో ఉంటారన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై కన్నేసి నడవడికను గమనించాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల గురించి సమాచారం తెలిస్తే స్థానిక పోలీసులకు లేదా 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. గతంలో కేసులపాలైన వారితోనూ మాట్లాడారు. అనంతరం నూతన సాంకేతిక పరిజ్ఞానం(సీఈఐఆర్)తో కాటారం సబ్ డివిజన్ పరిధిలో పలువురు వ్యక్తులు పోగొట్టుకున్న 11 సెల్‌ఫోన్లను బాధితులకు ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో కాటారం డీఎస్పీ గడ్డం రాంమోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, సబ్ డివిజన్ ఎస్సైలు మ్యాక అభినవ్ నరేష్, మహేందర్, హరిశేఖర్, చక్రపాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అభిషేక భద్రకాళి

కన్నులపండువగా శాకంబరీ ఉత్సవాలు ప్రారంభం

తొలిరోజు కామేశ్వరిగా అమ్మవారి దర్శనం



తొలిరోజు కామేశ్వరి అలంకరణలో అమ్మవారు


వరంగల్ కల్చరల్, జూలై 6 : అమ్మవారి శరణుఘోషతో భద్రకాళి ఆలయ పరిసరాలు మార్మోగాయి. ప్రత్యేక పూజలు.. అభిషేకాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వరంగల్ భద్రకాళి అమ్మవారి శాకంబరీ ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆషాఢ మాసం తొలి రోజు పాడ్యమి సందర్భంగా నవరాత్రి ఉత్సవాలు అట్టహాసంగా షురూ అయ్యాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఉత్సవాల ప్రారంభాన్ని ప్రత్యేక పూజలతో ప్రారంభించారు.

అమ్మవారికి సహస్ర వేయి కలశాలతో జలాభిషేకం నిర్వహించారు. అలాగే సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలు, పసుపు, కుంకుమ, గంధం, చందనం, పండ్ల రసాలతో అమ్మవారికి కన్నుల పండువగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అలంకరణ, అర్చన నిర్వహించారు. తొలిరోజు కామేశ్వరి మాతగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

బదిలీల కోసం ఎదురుచూపులు

తొమ్మిదేళ్లుగా ఒకేచోట సెర్ప్ ఉద్యోగులు

జిల్లాలో 75 మందికి తప్పని తిప్పలు..



భూపాలపల్లిటౌన్, జూలై 6 : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఉద్యోగులు బదిలీల కోసం కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్నారు. సుమారు దశాబ్ద కాలంగా బదిలీలు లేకపోవడంతో ఒకేచోట పని చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ ఐదేళ్లకు ఒకసారి బదిలీల ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా రెండు దశల్లో వాటి ఊసేలేకుండా పోయింది. గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శలు ఉన్నాయి.

కొత్త జిల్లాల ఏర్పాటు నుంచి..

తెలంగాణ ఆవిర్భావం అనంతరం కొత్త జిల్లాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో సెర్ప్ ఉద్యోగులను జిల్లాల వారీగా విభజించారు. ఆవెంటనే ఎన్నికల కోడ్ రావడం, కరోనా మహమ్మారి తదితర కారణాలతో ఇప్పటి వరకు బదిలీలు జరగలేదు. మరలా అసెంబ్లీ ఎన్నికలు వచ్చేంత వరకు బదిలీల ఊసే ఎత్తలేదని గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా బదిలీల ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జిల్లాలో 75 మంది ఉద్యోగులు

సెర్ప్ విభాగంలో రాష్ట్ర వ్యాప్తంగా 4వేల మంది ఉండగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 75 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో సీసీ(క మ్యూనిటీ కోఆర్డినేటర్లు)లు 50 మంది, ఏపీఎం (అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు)లు 18 మంది, డీపీఎం(అడ్మిన్ అసిస్టెంట్లు)లు ముగ్గురు ఉన్నారు. అలాగే ఎంటీకేలు, మండల సమాఖ్య కోఆర్డినేటర్లు, మినిస్టీరియల్ సిబ్బంది ఉన్నారు. వీరంతా గతంలో నల్లగొండ, ఆదిలాబాద్ జిల్లాల నుంచి బదిలీపై భూపాలపల్లికి వచ్చినవారే. ఇక్కడే తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. బదిలీల ప్రక్రియ ఇప్పటికైనా చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

తొమ్మిదేళ్లుగా ఎదురుచూపులే..

భూపాలపల్లి జిల్లాకు సెర్ప్ ఉద్యోగులు తొమ్మిదేళ్ల క్రితం వచ్చారు. అప్పటి నుంచి ఎటువంటి బదిలీలు జరగలేదు. ఈ క్రమంలో తా ము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఉద్యోగులు చెబుతున్నారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తమ ను సుదూర ప్రాంతాలైన ఆదిలాబాద్, నల్లగొండ జిల్లాల నుంచి బదిలీ చేసి ఇక్కడికి తీసుకువచ్చారని, నేటి వరకు బదిలీలు లేక పోవడంతో తాము స్వగ్రామాలకు వెళ్లి రావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. ఇదిలావుంటే.. సీసీలు తమ స్వంత మండలాల్లో ఉండి అవినీతి అక్రమాలకు పాల్పడు తున్నారనే ఆరోపణలున్నాయి. కాగా, వారిని అక్కడి నుంచి తప్పనిసరిగా బదిలీ చేయాలని ఆయా మండలాల మహిళా సంఘాలు కోరుతున్నాయి. వీరితో పాటు ఏపీఎంలు కూడా సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అలా కార్యాలయంలో ఇష్టారాజ్యంగా జరగుతుందని తెలిపారు. కాగా, సెర్ప్‌లో బదిలీలపై నిషేధం ఎత్తివేసి వెంటనే కౌన్సిలింగ్ ద్వారా ప్రక్రియ చేపట్టాలని ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

విద్యుత్ కార్యాలయాల్లో కన్జ్యూమర్ రిసెప్షన్ డెస్క్‌లు

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 6: వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు ఎస్ఈ కార్యాలయం నుంచి మొదలు సెక్షన్ ఆఫీసుల వరకు కన్జ్యూమర్ డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి తెలిపారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలతో సీఎండీ శుక్రవారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. రిసెప్షన్ డెస్క్‌ల ద్వారా ఫిర్యాదుల స్థితిని ట్రాక్ చేయడానికి వీలుంటుందని, ఫిర్యాదులను విశ్లేషణ చేసుకోవచ్చన్నారు. ఒక వేళ ఫిర్యాదుపై వినియోగదారుడు సంతృప్తి చెందకపోతే ఫిర్యాదు పునరావృతం అవుతుందన్నారు. ఫిర్యాదులను సంబంధిత ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలు పర్యవేక్షిస్తారన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్‌లో మొట్టమొదటిసారిగా విద్యుత్ బిల్లుపై క్యూఆర్ కోడ్ ముద్రించి వచ్చే నెల నుంచి అందిస్తామన్నారు. ఇప్పటికే వరంగల్ సర్కిల్ పరిధిలో మట్టెవాడ సెక్షన్, హనుమకొండ, భూపాలపల్లి, ఏజే మిల్స్ ఈఆర్‌ఓలలో ముద్రించి ఇస్తున్నట్లు తెలిపారు. ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే సరిచేయాలని అధికారులకు సూచించారు. ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్స్, అంతరాయాలు లేకుండా మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు అధికారి నుంచి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పని చేయాలన్నారు. విద్యుత్ సర్వీసుల మంజూరును ఆన్‌లైన్ ద్వారానే చేపట్టాలన్నారు. సబ్‌స్టేషన్‌ల నిర్వహణతో పాటు ఇతర అన్ని రకాల నిర్వహణను యాప్‌లో పొందుపర్చాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీజీఎంలు రాజుచౌహాన్, తిరుమల్‌రావు, కె.ఎన్.గుట్ట, కె.కిషన్ జీఎంలు గౌతమ్‌రెడ్డి, దేవేందర్, కృష్ణమోహన్, మల్లిఖార్జున్, నాగప్రసాద్, శ్రీనువాస్, శేషారావు, డీఈ ఐటీ. అనిల్‌కుమార్, డీఈ శ్రీధర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ యూత్ నాయకుడిపై కేసు

వరంగల్ క్రైం, జూలై 6: ఒకరిపై దాడి కేసులో 55వ డివిజన్ టీఆర్ఎస్ యూత్ నాయకుడు జి.సాయికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు కేయూ ఎస్ఐ సురేష్ తెలిపారు. స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్ జంక్షన్ సమీపంలోని బెల్టుషాపు నిర్వాహకుడి వంశీపై సాయి దాడి చేసి కొట్టాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఎంజీఎంలో ఒకే ఒక డెంటిస్టు

వైద్యుల కొరతతో ఇబ్బంది పడుతున్న రోగులు ● నియమించాలని డిమాండ్

వరంగల్ మెడికల్, జూలై 6: ఉత్తర తెలంగాణలో పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన ఎంజీఎం ఆస్పత్రిలో దంత వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. వందల సంఖ్యలో రోగులు వస్తున్నా.. ఒకే ఒక్క దంత వైద్యుడు తన పరిధిలో సేవలందిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఆ వైద్యుడిపై అధిక భారం పడుతోంది. ఒకవేళ ఆయన సెలవు పెట్టాండంటే అంతే సంగతులు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే దంత రోగులు వెనుతిరగాల్సిందే.

రెగ్యులర్ వైద్యుడికి ఫారిన్ సర్వీస్

ఈ విభాగంలో హెచ్ఓడీగా పని చేస్తున్న ప్రొఫెసర్ ఆరేళ్ల కిందట కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారిగా ఫారిన్ సర్వీస్‌లోకి వెళ్లారు. అప్పట్లో ఎంజీఎం అధికారులు కూడా ఉన్న ఒక్క ప్రొఫెసర్‌ను వదులుకునేందుకు ఎన్ఓసీ ఎందుకు ఇచ్చారో ఇంత వరకు ఎవరికీ అర్థం కావడం లేదు. మొత్తానికి సదరు వైద్యుడు ఫారిన్ సర్వీస్‌లో స్థిరపడిపోయాడు. ఇక మిగిలిన ఒకే ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ రెండేళ్ల కిందట అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతిపై వెళ్లిపోయాడు. ఇక ఎంజీఎంలో దంత వైద్య విభాగం వైద్యులు లేని దుస్థితి నెలకొంది. దీంతో తాత్కాలికంగా కాంట్రాక్టు పద్ధతిపై ఓ వైద్యుడిని నియమించారు. ఆ వైద్యుడే రోజు 200 వరకు ఓపీ చూస్తూ విభాగాన్ని నెట్టుకొస్తున్నారు. ఒకవేళ ఆయన సెలవు పెడితే సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు వెనుతిరిగిపోవాల్సిందే.

ఎన్ఎంసీ ఆక్షేపణ

దంత వైద్య విభాగంలో రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు లేరని నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆక్షేపణ వ్యక్తం చేస్తూ తాజాగా లేఖను పంపింది. దంత వైద్య విభాగంలో పీజీలు ఎస్ఆర్‌లు కూడా ఉండకపోవడంతో ఒకే ఒక వైద్యుడిపై భారం పడుతోందని ఎన్ఎంసీ అభ్యంతరాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం.





ఎంజీఎంలో దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

దరఖాస్తులకు మోక్షం ఎప్పుడో?

కాకతీయ మెడికల్ కళాశాల, ఎంజీఎం ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిపై విధులు నిర్వర్తించేందుకు ఒక అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టు కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ దరఖాస్తు స్వీకరించి నెలలు గడుస్తున్నా కనీసం పరిశీలనకు నోచుకోనట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా కేఎంసీ అధికారులు పేద రోగుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలనే డిమాండ్ వ్యక్తం అవుతోంది.

సంఖ్యను పెంచాలి

పేదల ఆస్పత్రిలో దంత వైద్యం కోసం వస్తున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యుల సంఖ్యను పెంచాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంత పెద్ద ఆస్పత్రిలో ఒకే ఒక వైద్యుడు ఉండటం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రిన్సిపాల్, డీఎంఈ, జిల్లా మంత్రులు స్పందించాలని రోగులు కోరుతున్నారు.

రూ.100కోట్లతో పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతాం

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ కల్చరల్, జూలై 6: ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక క్షేత్రంగా వరంగల్‌లోని భద్రకాళి ఆలయాన్ని రూ.100కోట్లతో అభివృద్ధి చేస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. భద్రకాళి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. మాడవీధులు, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.30కోట్ల నిధులు ఇవ్వగా, మరో రూ.70 కోట్లు నిధులు వెచ్చించి రూ.100 కోట్లతో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. వరంగల్ నగరాన్ని మెడికల్ హబ్, ఎడ్యుకేషన్ హబ్, టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కలెక్టర్ రెండు రోజుల్లో అమ్మవారి ఆలయాన్ని సందర్శించి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు ఈవీ శ్రీనివాస్, ఎన్ఆర్ఐలు కంచనకుంట్ల శ్రీధర్‌రెడ్డి, కీర్తి, ప్రముఖ పారిశ్రామిక వేత్త బాసని విశ్వప్రసాద్ శోభ, ప్రముఖ వైద్యుడు పోతాని రాజేశ్వరప్రసాద్, డాక్టర్ లలితాదేవితో పాటు వ్యాపారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో శేషభారతి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దంపతులు







రోదనల నడుమ అంత్యక్రియలు పూర్తి

దంతాలపల్లి రోడ్డు ప్రమాద మృతులకు పూర్తయిన దహనసంస్కారాలు

కన్నీరుమున్నీరైన గ్రామస్థులు, బంధువులు.. విషమంగానే క్షతగాత్రులు

దంతాలపల్లి, జూలై 6: వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై శక్రవారం రాత్రి దంతాలపల్లి మండలకేంద్రం శివారు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జరిగిన ఆటో - కారు ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారికి దహన సంస్కారాలు శనివారం రాత్రి పూర్తయ్యాయి. మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన పగిండ్ల కొమురయ్య, వాల్యా తండాకు చెందిన భూక్య నరేష్‌తో పాటు తొర్రూరు మండలం వెలికట్టకు చెందిన ఆటోడ్రైవర్ బందు మల్లేష్‌కు వారి వారి గ్రామాల్లో బంధువుల రోదనల నడుమ అంత్యక్రియలు పూర్తయ్యాయి. కాగా, మృతుడు పగిండ్ల కొమురయ్యకు కూతురు హారతి తల కొరవి పెట్టింది. మృతుడు నరేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయా గ్రామాల్లో పలువురు మృతదేహాలను సందర్శించి సంతాపాన్ని ప్రకటించారు.



ఇంటి ఎదుట కొమరయ్య మృతదేహంను చూసి రోదిస్తున్న బంధువులు

కారు సీజ్ - డ్రైవర్‌పై కేసు

దంతాలపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురిని బలిగొన్న కారును పోలీసులు శనివారం సీజ్ చేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. దంతాలపల్లి మండలంలోని రామానుజపురానికి చెందిన బొడ్డు సురేందర్.. ఖమ్మం నుంచి వస్తూ.. దంతాలపల్లి ఆర్టీసీ బస్టాండ్ శివారులో తొర్రూరు నుంచి వస్తున్న ఆటోను ఢీకొనడంతో ఆటోలో ఉన్న పగిండ్ల కొమురయ్య, భూక్య నరేష్, ఆటో డ్రైవర్ బందు మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు కారణమైన బొడ్డు సురేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరుణాకర్ వెల్లడించారు.

విషమంగానే క్షతగాత్రులు

దంతాలపల్లి మండలకేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో గాయపడిన తల్లీకూతుళ్ల పగిండ్ల మంజుల, పగిండ్ల అంజలి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు ఎస్సై కరుణాకర్ పేర్కొన్నారు. బీరిశెట్టిగూడెంకు చెందిన మృతుడు పగిండ్ల కొమురయ్య, ఆయన సతీమణి పగిండ్ల మంజుల, కుమార్తె అంజలి, బావమరిది కుమార్తె అక్కన్నపల్లి అక్షయ మహబూబాబాద్ మండలం అమనగల్ నుంచి శుక్రవారం రాత్రి బీరిశెట్టిగూడెంకు ఆటోలో బయలు దేరారు. ఈ క్రమంలో దంతాలపల్లి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆటో, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతిచెందగా, మంజుల, అంజలి, అక్షయ తీవ్రగాయాల పాలయ్యారు. వీరిని వరంగలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మంజుల, అంజలి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు.

డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాల విడుదల

కేయూ క్యాంపస్, జూలై 6: కేయూ డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి శనివారం విడుదల చేశారు. వివిధ కోర్సుల్లో 46,139 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 23,114 మంది 50.10 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు రిజిస్ట్రార్ మల్లారెడ్డి తెలిపారు.



ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

ట్రాఫిక్ స్తంభాలకు కేబుల్ వైర్లను తొలగించాలి..

వరంగల్ క్రైం, జూలై 6: మూడు రోజుల్లో ట్రైసిటీ పరిధిలో ఉన్న ట్రాఫిక్ స్తంభాలకు ఉన్న కేబుల్ టీవీ, ఇంటర్నెట్ కేబుల్ వైర్లను తొలగించాలని పోలీస్ కమిషనరేట్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైసిటీ పరిధిలో కొత్తగా ట్రాఫిక్ సిగ్నల్స్ స్తంభాలు ఏర్పాటు చేశామన్నారు. కాగా, పాత సిగ్నల్స్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలన్నారు. మూడు రోజుల్లో తొలగించకుంటే మున్సిపల్ సిబ్బందితో తొలగిస్తామని కమిషనరేట్ అధికారులు తెలిపారు.

నేడు 'రణధీర సీతక్క' పుస్తక ఆవిష్కరణ

హనుమకొండ కల్చరల్, జూలై 6: రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క జీవన ప్రస్థానంపై ప్రముఖ రచయిత ఆస్నాల శ్రీనివాస్ రాసిన 'రణధీర సీతక్క' పుస్తకావిష్కరణ సభను ఈ నెల 7వ తేదీన జిల్లా పరిషత్ హాలులో నిర్వహిస్తున్నట్లు దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ ప్రతినిధులు రాములు, బిల్లా మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి, ఆ పోరాట అమరుల స్మరణలో పుస్తక సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్క, ఎంపీ కడియం కావ్య హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ బుర్ర రమేశ్‌బాబు కీలకోపన్యాసం చేస్తారు. కవులు, కళాకారులు, ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

బాలికల హాస్టల్‌లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట జంక్షన్, జూలై 6: రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల హాస్టల్‌లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి, మెరుగు హనుమారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్, ఆపై చదువులు చదివే బాలికలు ఈ నెల 25లోపు ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 28న ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు బాలికతో పాటు తల్లి లేదా తండ్రి ఎవరైనా ఒకరు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. దరఖాస్తులను హనుమకొండ కనకదుర్గాకాలనీలోని రోడ్ నంబర్1లో గల హాస్టల్‌లో వార్డెన్ శోభారెడ్డికి అందించాలని కోరారు. ఇతర వివరాల కోసం 9676649811లో సంప్రదించాలని కోరారు.

తనిఖీల్లో తకరారు!





- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనాలు స్టాండ్స్‌కు తరలింపు
- అధిక డబ్బులు వసూలు చేస్తున్న నిర్వాహకులు
- స్టాండ్ నిర్వాహకులు, పోలీసులకు మధ్య ఒప్పందం

డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదాలను అరికట్టాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తనిఖీలు నిర్వహించాలని చెబుతుంటే.. కొంతమంది పోలీసు అధికారులు దాన్ని ఆసరాగా తీసుకొని డబ్బులు దండుకుంటున్నారు. ఆర్టీసీ స్కూటర్ పార్కింగ్, బస్టాండ్ చుట్టూరా ఉన్న పార్కింగ్ కేంద్రం నిర్వాహకులతో ముందే ఒప్పందం కుదుర్చుకుని వాహనదారుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. రోజుకిన్ని వాహనాలను పార్కింగ్ కేంద్రాలకు తరలించాలని లక్ష్యం పెట్టుకుని మరీ వాహనాలను స్కూటర్ స్టాండ్‌కు తరలిస్తుండడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ క్రమంలో రాత్రి పూట మద్యంషాపులతో పాటు, నగర శివారు భీమారం, ఎర్రగట్టు గుట్ట ఏరియాలో వాహన తనిఖీలను చేపట్టి వాహనాలను స్వాధీనం చేసుకొని పార్కింగ్ కేంద్రాలకు తరలిస్తూ వాహనదారుల జేబులకు చిల్లులు వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

హనుమకొండ టౌన్, జూలై 6 : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారుల నుంచి పార్కింగ్ పేరిట ఆయా స్కూటర్ స్టాండ్స్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ వసూళ్లలో కొంత ట్రాఫిక్ పోలీసులకు ముడుతుందనే ఆరోపణలున్నాయి. స్టాండ్ నిర్వాహకులతో ముందస్తుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఈ దందా సాగుతుందనే విమర్శలున్నాయి. ముఖ్యంగా హనుమకొండ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో ఈ దందా ఎక్కువగా సాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి.

వాహనం పట్టుబడితే అంతే..

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ వాహనదారుడికి వాహనం ఇచ్చేది లేదని ట్రాఫిక్ పోలీసులు చెబుతుంటారు. మత్తులో ఉన్న వ్యక్తికి వాహనం ఇచ్చి ప్రమాదాలను పెంచాలా..? అని ప్రశ్నిస్తుంటారు. అయితే వాహనదారుల వెంట వచ్చిన సంబంధీకులకు వాహనాలు ఎందుకు ఇవ్వరనే ప్రశ్నకు సమాధానాలు చెప్పరు. అయితే వాహనాలను నగరంలోని పార్కింగ్ కేంద్రాలకు తరలించి భారాన్ని మోపుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తికి కౌన్సెలింగ్ నిర్వహించి, కోర్టులో హాజరపరిచి తీర్పు వెల్లడించే వరకు ఆ వాహనం పార్కింగ్ కేంద్రాల్లోనే ఉంటుంది. ఈ లోపు నిర్వహకులు వారి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. బాధితులు కోర్టులో చెల్లించే జరిమానా కంటే పార్కింగ్‌కు చెల్లించే డబ్బులే తడిసి మోపడవుతున్నాయని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది ఇష్టారాజ్యం

హనుమకొండ ట్రాఫిక్‌లో పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే ఓ ఆర్ఎస్ఐ హోంగార్డులపై ఒత్తిడి తెస్తూ భారీ లోడుతో వచ్చే వాహనాలతో పాటు కొంత మంది వ్యాపారస్థుల దగ్గర వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ స్టేషన్ అధికారి మాత్రం చూసీచూడనట్లుగా ఉండడంతో ఆ ఆర్ఎస్ఐ ఆడిందే ఆటగా నడుస్తోందని సిబ్బంది చర్చించుకుంటున్నారు. సీపీ దృష్టిసారించి ట్రాఫిక్ పోలీసుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు వ్యాపారస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగి చిక్కితే పండగే..

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ప్రభుత్వ ఉద్యోగి పట్టుబడితే ట్రాఫిక్ సిబ్బందికి పండపండినట్లే.. కేసులో ఇరుక్కుంటే ఉద్యోగం పోతుందనే బెదిరింపులకు పాల్పడి అందినకాడికి దండుకుంటున్నారని విమర్శలున్నాయి. అలాగే కొద్ది రోజులు కిందట ఒక వ్యక్తికి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేస్తే ఆల్కహాల్ పర్సంటేజీ రాలేదు. దీంతో బండి కాగితాలు చూపించాలని మరో మెలిక పెట్టగా వాహనదారుడు చూపించకపోవడంతో బండిని పార్కింగ్‌కు తరలించారు. 24 గంటల్లో రూ.250 చెల్లించి బాధితుడు తన వాహనాన్ని తెచ్చుకున్నాడు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నెల రోజులకు ముందు ఓ వ్యక్తి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడగా పోలీసులు రైల్వే స్కూటర్ స్టాండ్‌కు వాహనాన్ని తరలించారు. ఆ వ్యక్తి 20 రోజుల తర్వాత వాహనం కోసం వెళ్లగా వేలల్లో డబ్బులు అడగగా వాహనాన్ని అక్కడే వదిలేసినట్లుగా సమాచారం.

బైక్ ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నీలమ్మ

కొత్తగూడ, జూలై 6: రోడ్డుపై వెళుతున్న వృద్ధురాలిని వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలప్రకారం.. కొత్తగూడ మండల కేంద్రానికి చెందిన వెలుదండి నీలమ్మ రోడ్డుపై నడుస్తుండగా వెనకాల నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా ద్విచక్రవాహనంపై వచ్చిన వ్యక్తి బలంగా ఢీకొట్టాడు. దీంతో నీలమ్మ కుడి కాలు విరిగింది. తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అదించగా, హనుమకొండలోని ప్రయివేటు ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. వృద్ధురాలి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు కుటుంబీకులు తెలిపారు.

ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 6: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వరంగల్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.జుమ్లానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు http://iti.telangana.gov.in అనే వెబ్ పోర్టల్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



విద్యార్థినికి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపాల్ బి. ప్రభాకర్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 6: ఎప్‌సెట్ కౌన్సిలింగ్ ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమైంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆర్ట్స్ కళాశాల, కేడీసీ, కేయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ హెల్ప్‌లైన కేంద్రాల్లో ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా విద్యార్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించి సంబంధించిన ధృవపత్రాలను విద్యార్థులకు అందజేశారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసి హెల్ప్‌లైన్ కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయగా, ఆర్ట్స్ కళాశాల సెంటర్‌లో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జోతి విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశారు.

గుట్కా పట్టుకున్న పోలీసులు

వరంగల్ క్రైం, జులై 6: వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రంలో రూ.33వేల విలువ కలిగిన గుట్కాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మండల కేంద్రంలో కె.సురేష్ అనే వ్యక్తి నిషేధిత గుట్కా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి గుట్కా స్వాధీనం చేసుకున్నారు. విక్రయదారుడిని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులకు విచారణ నిమిత్తం అప్పగించారు. ఈ విషయాన్ని సీఐ రవికుమార్ ధ్రువీకరించారు.

వెహికిల్ షెడ్డులో రచ్చ.. రచ్చ..

మెకానిల్‌కు, సూపర్‌వైజర్‌కు మధ్య గొడవ ● అధికారులకు ఇరువర్గాల ఫిర్యాదు

వరంగల్ కార్పొరేషన్, జూలై 6: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధి బాలసముద్రంలోని బల్దియా వెహికిల్ షెడ్డులో జరిగిన గొడవ రచ్చకెక్కింది. శనివారం షెడ్డులో అక్కడి మెకానిక్‌లకు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మధ్య జరిగిన గొడవ రచ్చరచ్చగా మారింది. షెడ్డులో పెద్దఎత్తున గొడవ జరగడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని ఇరు వర్గాలను సముదాయించారు. ఈ క్రమంలో కొంతసేపు మెకానిక్‌లు పనులు మానేసి నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళితే..

బాలసముద్రంలోని బల్దియా వాహనాల మరమ్మతు కేంద్రంలో ముగ్గురు మెకానిక్‌లతో పాటు ఇద్దరు పంక్చర్లు అతికించే సిబ్బంది పనిచేస్తారు. అయితే ఇటీవల షెడ్డులో జరుగుతున్న దొంగతనాలపై అక్కడ పని చేసే సిబ్బందిని గుర్తించిన అధికారులు.. వారిని తొలగించి కొత్త వారికి అవకాశం ఇచ్చారు. అయితే బల్దియా కార్యాలయంలో ఆరోపణలు ఎదుర్కొన్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని బల్దియా షెడ్డులో నియమించారు. అందులో సదానందం అనే ఓవర్ స్టోరేజీ డ్రైవర్‌ను ఇక్కడ నియమించారు. ఈయన షెడ్డు ఇన్‌చార్జి అధికారులైన ఈఈ, డీఈల సహకారంతో షెడ్డు సూపర్‌వైజర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. దీంతో సదానందం అక్కడ పని చేసే మెకానిక్‌లు, సహాయ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందిపై అజామాయిషీ చెలాయిస్తున్నాడు. ఇది సహించలేని మున్నా అనే మెకానిక్ శనివారం తిరగబడ్డాడు. దీంతో ఇరువర్గాల మధ్య పెద్ద ఎత్తున గొడవ చోటు చేసుకుంది. ఒకరిని ఒకరు నెట్టి వేసుకున్నారు. అక్కడి సిబ్బంది కలుగ జేసుకుని సదానందం, మున్నాలను విడిపించారు. అక్కడి వారు వీరి గొడవను వీడియో తీసి వైరల్ చేశారు. ఇరువర్గాలు బల్దియా అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. బల్దియా షెడ్డులో జరిగిన గొడవపై అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా స్పందించలేదు.



మాట్లాడుతున్న ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుమల్‌రావు

విద్యార్థులు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుమల్‌రావు

భీమారం, జూలై 6: విద్యార్థులు నైపుణ్యాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.తిరుమల్‌రావు అన్నారు. హనుమకొండ భీమారంలోని ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో శనివారం ఇండస్ట్రీ, ఇనిస్టిట్యూషన్ ఇంటరాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం డాక్టర్ తిరుమల్‌రావు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్, ఫార్మసీ, బిజినెస్ మేనేజ్‌మెంట్ వంటి ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించిన కార్యక్రమాల ప్రాధాన్యతను వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పరిశ్రమలోని నిపుణులతో మమేకమై వారి అనుభవంతో కెరీర్ పరంగా ముందుండాలని సూచించారు. ప్లేస్‌మెంట్స్‌లో విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చే ఇలాంటి కార్యక్రమాలు తరుచూ నిర్వహిస్తాయని ఆయన విద్యార్థులకు హామీ ఇచ్చారు. మల్టీనేషనల్ కంపెనీ అసోసియేట్ డైరెక్టర్ గణేష్ రమేశ్ ప్రొఫెషనల్ కెరీర్‌ల కోసం రిక్రూట్‌మెంట్ ప్రక్రియకు అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానం గురించి వివరించారు. వివిధ పారిశ్రామిక రంగాల్లో తాజా సాంకేతిక పరిణామాలపై కూడా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు చెందిన డైరెక్టర్లు హరిప్రశాంత్, సూరజ్ శర్మ, ఆదిత్య కుమార్, నీరజా కేసరి, వైష్ణవి, ప్రముఖ కంపెనీల డైరెక్టర్లు, ఎండీలు పాల్గొన్నారు.

ఫీటల్ మెడిసిన్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ శిరీషరెడ్డి

వరంగల్ మెడికల్, జూలై 6: అంజియో ఎంబోలైజేషన్ అనే పద్ధతి ద్వారా గర్భిణికి కోరియాంజియోమ అనే కణతికి రాష్ట్రంలోనే తొలిసారిగా చికిత్స అందించి తల్లి, బిడ్డ ప్రాణాలను కాపాడినట్లు హనుమకొండలోని ఫీటల్ మెడిసిన్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ శిరీషరెడ్డి తెలిపారు. ఈ తరహాలో చికిత్స భారత దేశంలో మూడోదని, రాష్ట్రంలోనే తొలిసారి హనుమకొండలో నిర్వహించినట్లు తెలిపారు. వరంగల్ రంగశాయిపేటకు చెందిన వేమునూరి హారిక 27 వారాల గర్భవతి. కడుపునొప్పితో గైనకాలజిస్టు డాక్టర్ వరలక్ష్మిని సంప్రదించిందని, అయితే స్కానింగ్ కోసం తమ వద్దకు పంపగా సుమారు 10 సెం.మీ. కణతి గర్భం దగ్గరలో ఉందని, దీనివల్ల గర్భంలో ఉన్న శిశువుకు రక్తం సరఫరా తగ్గడం, శిశువు గుండెపై తీవ్ర ప్రభావం చూపుతుందని స్కానింగ్‌లో గుర్తించామన్నారు. గర్భిణీ ఇష్టం మేరకు కోరియాంజియోమ అనే కణతిని అంజియో ఎంబోలైజేషన్ అనే పద్ధతిలో అత్యంత సమర్థవంతంగా పనిచేసి ఈ నెల 5వ తేదీన ప్రసవం చేసినట్లు తెలిపారు. శిశువు 2.75 కేజీలతో ఆరోగ్యంగా ఉందని, ఈ తరహా చికిత్సను విజయవంతం పూర్తి చేసినట్లు డాక్టర్ శిరీషరెడ్డి వెల్లడించారు.

భీమునిపాదంలో జల సవ్వడి

పెరుగుతున్న పర్యాటకుల తాకిడి

కనువిందు చేస్తున్న జలపాతం



గూడూరు (మహబూబాబాద్ జిల్లా), జూలై 6 : గూడూరు మండలంలోని సీతానగరం శివారు కొమ్ములవంచ పరిధి అటవీప్రాంతంలో పచ్చని ప్రకృతినడుమ నిరంతరం జలధారతో అలరిస్తున్న భీమునిపాదం జలపాతం 70 అడుగులపై నుంచి జాలువారుతున్న వాటర్ పాల్స్‌ను చూసి పర్యాటకులు అబ్బురపోతున్నారు. శనివారం కురిసిన వర్షానికి భీమునిపాదంలో పర్యాటకుల సందడి పెరిగింది. రోజురోజుకు పర్యాటకుల సందడితో రద్దీగా మారుతుంది. ఆకాశంలో విరిసిన హరివిల్లు, మేఘాలను మోసుకువస్తున్నట్లు.. రాళ్లమీద నుంచి దూదిపిండెలు లోయలోకి దూకుతున్నట్లు 70 అడుగులపై నుంచి మంచు తెరలను తలపిస్తూ నీటి ధారాలు పడుతుంటే చూసే కన్నులకు ఎంతో హాయి... ఆకుపచ్చని ప్రకృతిలో గలగల పారే సెలయేరు ఒక్కసారిగా మాయమై గుట్టలమీది నుంచి కిందికి జాలువారుతుంటే మనస్సు పులకరిస్తుంది. ఈ రమణీయ దృశ్యాలకు నెలవు శోభలిల్లే సోయగాలులకు నెలవు భీమునిపాదం. ఈ వర్షకాలంలో పచ్చపచ్చని ప్రకృతిలో గలగల పారేటి సెలయేటి మధ్య సేద తీరుదాం రండి అంటూ భీమునిపాదం జలపాతం పిలుస్తోంది.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, జూలై 6 : కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మహదేవపూర్ మండలంలో గల మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువన వర్షాలు కురుస్తుండటంతో బ్యారేజీకి వచ్చే ఇన్‌ఫ్లో పెరుగుతోంది. శుక్రవారం బ్యారేజీలోకి వచ్చే ఇన్‌ఫ్లో 20,265 క్యూసెక్కులుగా ఉండగా, శనివారం అంతే ప్రవాహంతో నిలకడగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. గేట్లన్నీ తెరిచి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వరద ప్రవాహం పెరిగితే బ్యారేజీకి వచ్చే ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

చౌకధరల దుకాణంలో షార్ట్‌సర్క్యూట్

ఫర్నీచర్, రికార్డులు దగ్ధం

వాజేడు, జూలై 6: మండలంలోని పెదగొల్లగుడెంలో జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చౌకధరల దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ సంభవించి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సేల్స్‌మన్ చంద్రకళ తెలిపిన ప్రకారం.. శనివారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో దుకాణాన్ని తెరవగా దట్టమైన పొగ కమ్ముకొని ఫర్నీచర్, రికార్డులు, ఐరిష్ యంత్రం తదితర సామాన్లు కాలిపోయి ఉన్నాయని తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగి ఉంటాయని చెప్పారు. ఈ ప్రమాదంలో సుమారు రూ20వేల వరకు నష్టం వాటిల్లినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ఘటనపై జీసీసీ ఉన్నతాధికారులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

మొరం అక్రమ రవాణాను అరికట్టాలి

గణపురం, జూలై 6: మండలంలోని మైలారం గుట్టల నుంచి తరలిస్తున్న మొరం అక్రమ రవాణాను అరికట్టాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. గత కొన్ని రోజులుగా మైలారం గుట్ట నుంచి మైనింగ్, రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా రాత్రింబవళ్లు మొరం తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి కొందరు సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు స్వామినాథన్, కండే రవి, కొగిల జితేందర్, నరసింహా, సదయ్య, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

రామప్పలో విద్యార్థుల సందడి



దేవాలయం ఆవరణలో విద్యార్థులు

వెంకటాపూర్(రామప్ప), జూలై 6 : మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో శనివారం విద్యార్థుల సందడి నెలకొంది. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు రామలింగేశ్వర స్వామిని దర్శించుకోగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా గర్భగుడి తూర్పు ముఖద్వారాన ఉన్న నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి గైడ్‌ల ద్వారా ఆలయ విశిష్టత, చరిత్రను తెలుసుకుని మంత్రముగ్ధులయ్యారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

ముంపు నివారణ చర్యలు చేపట్టిన ఎన్‌హెచ్

మోరంచపల్లి వద్ద పాత బ్రిడ్జిని కూల్చివేసిన అధికారులు

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 6 : గతేడాది మోరంచపల్లి గ్రామం ముంపునకు గురైన ఘటనను దృష్టిలో పెట్టుకొని నేషనల్ హైవే అధికారులు నివారణ చర్యలు చేపట్టారు. భూపాలపల్లి-కాళేశ్వరం జాతీయ రహదారి 353సి మోరంచపల్లి వద్ద నిర్మించిన బ్రిడ్జి వద్ద గతంలో ఉన్న పాతబ్రిడ్జిని శనివారం అధికారులు కూల్చివేశారు. పాత బ్రిడ్జి చిన్నగా ఉండటంతో మోరంచవాగు ఉధృతికి అడ్డంకిగా ఉండి గ్రామం ముంపునకు ఒక కారణంగా గుర్తించిన అధికారులు ప్రొక్లెయిన్‌తో బ్రిడ్జిని పూర్తిగా తొలగించారు.

ఏరియా అధికారులతో డైరెక్టర్ సమీక్ష

కాకతీయఖని, జూలై 6 : సింగరేణి భూపాలపల్లి ఏరియా అధికారులతో సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్) ఎన్‌వీకే శ్రీనివాస్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం అయినందున ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులో బొగ్గు ఉత్పత్తికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అండర్ గ్రౌండ్ గనుల్లో ఉత్పత్తిని పెంచాలని, రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని చేపట్టాలని ఏరియా అధికారులన ఆదేశించారు. సమీక్షకు ముందు ఓసీ-2, ఓసీ-3లో పర్యటించారు. ఏరియా జీఎం కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో జీఎం హబీబ్‌హుస్సేన్, జ్యోతి, తుకారాం, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ ఢీకొని రెండు పాడిగేదెలు మృతి

ఏటూరునాగారం, జూలై 6 : ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి వద్ద శనివారం మేత కోసం వెళ్తూ రోడ్డు దాటుతున్న రెండు గేదెలను అతివేగంతో ఇసుక లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితుల వివరాల ప్రకారం.. శంకరాజుపల్లిలోని నాయకపు దేవేందర్‌కు చెందిన రెండు పాడి గేదెలు రోజు వారిగానే మేత కోసం వెళ్లాయి. ఈ క్రమంలో 163 జాతీయ రహదారిపై ఇసుక లారీ వాజేడు వైపు నుంచి ఏటూరునాగారం వెళ్తున్న క్రమంలో ముల్లకట్ట శివాలయం గుడి వద్ద గేదెలను ఢీకొట్టడంతో మృతి చెందాయి. పాడి గేదెల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

పదవీ విరమణ పొందిన అంగన్‌వాడీలకు సన్మానం

మల్హర్, జూలై 6 : 42 ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్లుగా సేవలందించి పదవీ విరమణ పొందిన మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామానికి చెందిన వెంకటనర్సమ్మ, విజయ, హైమావతిలను శనివారం అంగన్‌వాడీ టీచర్లు ఘనంగా సన్మానించారు. తాడిచర్ల 2వ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారిని శాలువాలతో సన్మానించారు. వారి సేవలను సూపర్‌వైజర్ సరస్వతి కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బాలమ్మ, వెంకటనారమ్మ, జయప్రభ, అరుణ, లక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

యాదవ సంఘం మహాసభ గ్రామ కమిటీల ఎన్నిక

మల్హర్, జూలై 6 : మండలంలోని అన్‌సాన్‌పల్లి, నాచారంలో శనివారం అఖిల భారత యాదవ సంఘం మహాసభ నూతన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. అన్‌సాన్‌పల్లి అధ్యక్షుడిగా కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా రవితేజ యాదవ్, కోశాధికారిగా రాంబాబులను ఎన్నుకున్నారు. అలాగే నాచారం గ్రామ శాఖ అధ్యక్షుడిగా సంపత్ యాదవ్, ప్రధాన కార్యదరిశగా వినోద్‌యాదవ్, కోశాధికారిగా మహేందర్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో యాదవ సంఘం డివిజన్ అధ్యక్షుడు ఆత్మకూరి స్వామి, ప్రధాన కార్యదర్శి బోయిని రాజయ్య మండల అధ్యక్షుడు యాదండ్ల రామన్న, డివిజన్ సహాయ కార్యదర్శి చిన్నమల్లయ్య, భూమేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న ప్రజలు

మహదేవపూర్, జూలై 6: మండలంలోని కాళేశ్వరంలో వరుస చోరీలతో గ్రామస్థులు బెంబేలెత్తుతున్నారు. రెండు రోజుల క్రితం కిరాణా షాపులో రూ20వేలు చోరీ చేశారు. అదే రోజు రాత్రి ఓ బైక్ చోరీ జరిగింది. అలాగే శనివారం రాత్రి కన్యకాపరమేశ్వరి ఆలయంలో దొంగలు పడ్డారు. ఇవేకాక కొద్ది రోజుల క్రితం స్థానికంగా ఓ సెల్‌ఫోన్ షాపులో దొంగతనం జరిగింది. పోలీస్‌స్టేషన్‌కు 200 మీటర్ల పరిధిలోనే దొంగతనాలన్నీ జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో గ్రామం ఉండడంతోపాటు ప్రముఖ దేవాలయం ఉండడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నందున అధికారులు నిఘావ్యవస్థను పటిష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వామ్మో కోనోకార్పస్ మొక్కలు..

శ్వాసకోశ రోగులకు ప్రమాదకరం **తొలగించాలని ప్రజల విజ్ఞప్తి**



భూపాలపల్లి ప్రధాన రహదారిపై ఏపుగా కోనోకార్పస్ మొక్కలు

భూపాలపల్లిటౌన్, జూలై 6: పట్టణ ప్రజలకు ప్రమాదం పొంచివుంది. ఆ మొక్కలతో శ్వాసకోశ వ్యాధులకు దారితీస్తుందనే విషయం తెలిసిన నాటి నుంచి ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఉబ్బసం వ్యాపింపజేస్తుందని అస్తమా ఉంటే వారి పరిస్థితి మరింత ఆందోళనకరం అని పట్టణ ప్రజలు వణికిపోతున్నారు. వెంటనే తొలిగించాలని కోరుతున్నారు. భూపాలపల్లిలోని హనుమాన్ దేవాలయం నుంచి మొదలుకుని ప్రధాన జాతీయ రహదారి వెంట సుమారు 8కిలోమీటర్ల మేరకు 2016లో కోనోకార్పస్ లెంటి ఫోలియస్ అనే మొక్కలను నాటారు. ఈ మొక్కలు సుమారు 6 మీటర్ల వరకు ఏపుగా పెరిగి రోడ్డుకు మధ్యలో అందంగా కనిపిస్తున్నాయి. కానీ, వీటితో పెద్ద ప్రమాదం పొంచి ఉందని తెలుసుకున్న నాటి నుంచి పట్టణ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ మొక్కలు మనుషులకు, జంతువులకు శ్వాసకోశ వ్యవస్థపై ప్రభావితం చూపుతాయని శాస్త్రవేత్తలే చెబుతున్నారు. పట్టణంలో ఈ మొక్కలను నరికివేయాలని కోరుతున్నారు. వాటి స్థానంలో ఆరోగ్యకరమైన మొక్కలు నాటాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కాగా,రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉన్న మొక్కలను తొలగించడం విశేషం.

అక్రమంగా సింగరేణి మట్టి తరలింపు

అనుమతులు ఒకచోటకు.. తరలింపు మరోచోటకు

సొమ్ము చేసుకుంటున్న దళారులు





భూపాలపల్లిలో సింగరేణి మట్టిని లారీలో పోస్తున్న జేసీబీ, ప్రైవేటు వెంచర్‌లోకి మట్టిని తరలిస్తున్న లారీ

కాకతీయఖని, జూలై 6: సింగరేణి సంస్థకు సంబంధించిన మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఒక చోటికి అవసరం ఉందని అనుమతులు తీసుకుని.. వేరే చోటికి తరలిస్తూ దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. భూపాలపల్లి జిల్లా అయినప్పటి నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు దళారులు మట్టి వ్యాపారాన్ని ప్రారంభించారు. గుడులు, బడులు, వ్యవసాయ భూములకు మట్టి అవసరముందని అనుమతులు తీసుకుని రియల్ ఎస్టేట్ వెంచర్లకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వారికి నిజంగా మట్టి అవసరం ఉందా... లేదా అని విచారణ చేపట్టకుండానే సింగరేణి అధికారులు అనుమతులు ఇస్తుండడం పట్ల తీవ్ర విమర్శలొస్తున్నాయి.

విచ్చలవిడిగా అనుమతులు

సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్టు ప్రాజెక్టుల్లోని మట్టిని కొందరు దళారులు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకు సింగరేణి అధికారులు విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడమేనని పలువురు చెబుతున్నారు. మట్టి కోసం దరఖాస్తు చేసుకున్న వారు అనుమతులు కోరిన చోటికి తరలిస్తున్నారా.. లేదా అని సింగరేణి అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సింగరేణి మట్టి పరిసర ప్రాంత ప్రజలకు అవసరం ఉంటే ఏరియా జీఎం, ప్రాజెక్టు అధికారి, సెక్యూరిటీ అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే కొందరు సింగరేణి అధికారులు 'మామూలు'గానే తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దళారుల నుంచి పలువురు సింగరేణి అధికారులు మట్టికి అనుమతులు ఇచ్చేందుకు నెలకు రూ.20వేల నుంచి రూ.30వేలు తీసుకుంటున్నారనే ఆరోపణలువినిపిస్తున్నాయి. అయితే వెంచర్లలో పోసేందుకు మట్టికి డిమాండ్ ఉండడంతో సింగరేణి అధికారులను మచ్చిక చేసుకుని ఈ దందాకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

విజిలెన్స్ దృష్టి సారించేనా?

సింగరేణిలో అవినీతి, అక్రమాలకు తావివ్వకుండా చూసుకుంటామని ఇప్పటికేసింగంణి సీఎండీ బలరాం నాయక్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. మెడికల్ అనిఫిట్ దందా, కార్మికుల బదిలీలు, ఉచిత మస్టర్లు, ఉద్యోగాలు ఇప్పిస్తామని దళారుల మోసాలపై ఉక్కు పాదం మోపాలని సింగంణి బాస్ చర్యలు ప్రారంభించారు. అయితే ఏరియాలో మట్టి దందాలో దళారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయనే ఆరోపణలు వస్తుండటంతో సింగరేణి విజిలెన్స్ అధికారులు ఈ తతంగంపై దృష్టి సారించాలని కార్మికులు కోరుతున్నారు. ఇప్పటికైనా విజిలెన్స్ అధికారులు ఇటీవలలో మట్టికి ఇచ్చిన అనుమతులపై విచారణ చేపట్టి అక్రమార్కులపై చర్యలుతీసుకోవాలని పలువురు డిమాండ్‌చేస్తున్నారు.

కేజీవీల్స్ రోడ్లపైకి రావొద్దు : ఎస్సై

వెంకటాపూర్(రామప్ప), జూలై 6: మండలంలోని గ్రామాల్లో ట్రాక్టర్ కేజీవీల్స్ రోడ్లపైకి రావొద్దని ఎస్సై జక్కుల సతీష్ యజమానులకు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో వ్యయంతో ప్రజలకు మెరుగైన రవాణా కోసం రోడ్లను నిర్మించిందని అన్నారు. కొందరు ట్రాక్టర్ యజమానులు పొలాల్లో పని చేయడానికి కేజీవీల్స్‌ను ఉపయోగించడం వల్ల రోడ్లు ధ్వంసమవుతున్నాయని తెలిపారు. కేజీవీల్స్‌తో రోడ్లపైకి వచ్చే ట్రాక్టర్ యజమానులపై మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఐటీఐ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు

కాటారం, జూలై 6 : మండలంలోని గంగారం మోడల్ స్కూల్ సమీపంలో విలాసాగర్ రెవెన్యూ శివారులోని సర్వే నంబరు 392లో కాటారం ప్రభుత్వ ఐటీఐ కళాశాల కోసం కేటాయించిన 7ఎకరాల స్థలాన్ని కలెక్టర్ రాహుల్‌శర్మ శనివారం సందర్శించారు. రెవెన్యూ అధికారులు 3 నెలల క్రితం సర్వే నిర్వహించి ప్రభుత్వ స్థలాన్ని ఐటీఐ కళాశాలకు కేటాయించి హద్దులు చూపించారు. ఇటీవల కొందరు తమకు కేటాయించిన ప్రభుత్వ భూమి అంటూ హద్దురాళ్లను ధ్వంసం చేశారు. ఐటీఐ ప్రిన్సిపాల్ భిక్షపతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతోపాటు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ రాహుల్‌శర్మ భూమిని పరిశీలించి ఐటీఐ అధికారులను ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఆర్‌ఐ వెంకన్న, ఐటీఐ టీవో తిరుపతి, ఓఎస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు బుక్కుల పంపిణీ

తాడ్వాయి, జూలై 6: మండలంలోని బంజర ఎల్లాపూర్, పంబాపూర్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు శనివారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో దాతలు వీరపనేని రామదాసు-వెంకటసుబ్బమ్మల జ్ఞాపకార్థం ఉచితంగా నోటు బుక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సుతారి పాపారావు, మండల నోడల్ ఆఫీసర్ రేగ కేశవరావు, నాయకులు వంగ పాపయ్య, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఏటూరునాగారం, జూలై 6 : ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న జీపీ కార్మికులు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను చెల్లించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందన్నారు. పంచాయతీ అధికారులు వేతనాలు ఇవ్వకుండా రేపు, మాపు అంటూ పని చేయించుకుంటున్నారని తెలిపారు. నిరుపేదలమైన తమ కష్టాన్ని గుర్తించి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు.

విశ్వహిందూ పరిషత్ మండల కమిటీ ఎన్నిక

మల్హర్, జూలై 6 : మండల కేంద్రమైన తాడిచర్ల వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశ్వహిందూ పరిషత్ మండల కమిటీని ఎన్నుకున్నారు. వరంగల్ విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి నంద్యాల చందర్‌బాబు, అధ్యక్షుడు దేవరావు, సహ కార్యదర్శి అంకిరెడ్డి ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడిగా ఒల్లాల రమేష్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జంబోజు రవీందర్, కార్యదర్శిగా లింగన్నపేట శ్రీనివాస్, సహ కార్యదర్శిగా కుక్కుడపు ఆశోక్, సత్సంగ ప్రముఖ్‌గా ఓజల రాజబాపు, సహ సత్సంగ్ ప్రముఖ్‌గా కుక్కుడపు వెంకటేశ్వర్లు, కోశాధికారిగా రేపాల హరీష్, భజరంగ్‌దళ్ సంయోజక్‌గా కోట నవీన్, సహ సత్సంగ్ ప్రముఖ్ ఎల్లూరి శ్రీనివాస్, సేవా ప్రముఖ్ గంగదారి సమ్మయ్యలను ఎన్నుకున్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

యాంటీ నార్కొటిక్ బ్యూరో డీఎస్పీ సైదులు

ములుగు రూరల్ జూలై 6 : యువత యాంటీ డ్రగ్స్ వారియర్‌గా నిలిచి నవ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని యాంటీ నార్కొటిక్ బ్యూరో డీఎస్పీ కె.సైదులు అన్నారు. యాంటీ నార్కొటిక్ బ్యూరో, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో శనివారం ములుగు మండలం జాకారంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సైదులు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలన్నారు. డ్రగ్స్ జీవితాన్ని నాశనం చేయడంతో పాటు భవిష్యత్ లేకుండా చేస్తుందనే విషయాన్ని విద్యార్థులు, యువత గ్రహించాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయించినా, అలవాటు పడినట్లు మీరు గమనిస్తే వెంటనే 100 నంబర్‌కు లేదా నార్కొటిక్ బ్యూరో (8712671111)కు కాల్ చేయాలన్నారు. అనంతరం మత్తు పదార్థాలకు అలవాటు కావద్దని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీఐలు బి.రాజేష్, వి.శంకర్, ఎస్సై సీహెచ్.వెంకటేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ యాదగిరి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలి

ములుగు కలెక్టరేట్, జూలై 6 : 2024 సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పాణిని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులు ఈనెల 15వ తేదీ లోపు హెచ్‌టీటీపీ://నేషనల్‌అవార్డ్సటుటీచర్స్.ఎడ్యుకేషన్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పెంపుడు జంతువులకు రేబిస్ నివారణ టీకాలు వేయించాలి

చిట్యాల, జూలై 6 : పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్య శాఖ జిల్లా అధికారి శ్రీదేవి అన్నారు. శనివారం ప్రపంచ జూనోసెస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెంపుడు కుక్కలు, పిల్లులకు ప్రతీ సంవత్సరం రేబిస్ నివారణ టీకాలు వేయించడం ద్వారా ప్రాణాంతక వైరస్‌ను నిర్మూలించవచ్చన్నారు. అనంతరం రేబిస్ వ్యాధి, నివారణపై గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీ వెంకన్న, ప్రిన్సిపాల్ భిక్షపతి, సిబ్బంది నెహ్రూనాయక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల రిలే దీక్షలు ప్రారంభం



రిలే దీక్షలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్

ములుగు కలెక్టరేట్, జూలై 6: 65 సంవత్సరాలు పైబడిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష, జీతంలో సగంపెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు కలెక్టరేట్ ఎదుట శనివారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈదీక్షలను సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీలకు అతితక్కువ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇచ్చి వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని చూడడం సరికాదన్నారు. అధికారులు జీవో 10ని అడ్డుపెట్టుకుని 65ఏళ్లు దాటినవారు సెంటర్లకు రావొద్దని వివరాలుసేకరిస్తున్నారని, అటువంటి జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, రిలే దీక్షలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు భూక్య జంపన్న, కేజీకేఎస్, డీవైఎఫ్‌ఐ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేజీకేఎస్, డీవైఎఫ్‌ఐ నాయకులు ఎమ్డీ.గఫూర్, గుండెబోయిన రవి, రత్నం ప్రవీణ్, అంగన్‌వాడీ టీచర్లు సరోజన, భాగ్యలక్ష్మి, ప్రేమకుమారి, వెంకటరమణ, సరిత, రమాదేవి, నిర్మల, రుక్మిణి, మంజుల, విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

దారి దోపిడీ ముఠా సభ్యుల అరెస్టు

వివరాలు వెల్లడించిన సీఐ కుమార్



ముఠా సభ్యుల అరెస్టు చూపి వివరాలు వెల్లడిస్తున్న సీఐ కుమార్

వెంకటాపురం(నూగూరు), జూలై 6: మండలంలో కాంట్రాక్టర్లు, లారీ డ్రైవర్లు, వాహనదారులను బెదిరించి దోపిడీకి పాల్పడుతున్న ముఠా సభ్యులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ బండారి కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండలంలోని వెంగళరావుపేటకు చెందిన వేల్పుల రాంకుమార్, వేల్పుల నవీన్, ఎస్సీమర్రిగూడెం గ్రామానికి చెందిన వేల్పుల మనోజ్‌లు ఈనెల 1న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం పామేడు నుంచి జగదల్‌పూర్ మార్కెట్‌కు ఇప్పపువ్వు, బియ్యం లోడుతో వెంకటాపురం మీదుగా లారీ వెళ్తుండగా వెంబడించారు. రామచంద్రాపురంలోని ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో రాత్రి 11.30 గంటలకు ప్రెస్ లోగో పెట్టుకుని లారీని ఆపి డ్రైవర్ అనుముల్‌కృష్ణను బెదిరించారని అన్నారు. డ్రైవర్ కిందికి దిగకపోవడంతో కర్రలు, రాళ్లతో బెదిరింపులకు పాల్పడి జేబులో ఉన్న రూ.40వేలను బలవంతంగా లాక్కున్నారని తెలిపారు. కాగా, శనివారం ఉదయం 3గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు వేల్పుల రాంకుమార్ ఇంటివద్ద కలుసుకుని ఇసుక లారీ డ్రైవర్లు, కాంట్రాక్టర్లను బెదిరించి డబ్బులు వసూలు చేద్దామని ప్లాన్ వేసుకున్నారని అన్నారు. ఈ విషయం తమకు తెలియడంతో ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. దీంతో వారు చేసిన నేరాన్ని అంగీకరించడంతో రూ.32వేల నగదు, ప్రెస్ లోగోను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. వారిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. సమావేశంలో ఎస్సై తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరం-పలుగుల రోడ్డుపై ట్రాఫిక్ జామ్

మహదేవపూర్, జూలై 6 : మండలంలోని కాళేశ్వరం-పలుగుల రోడ్డుపై శనివారం ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఇసుక లారీలు ఎక్కువ సంఖ్యలో వస్తుండడంతో రహదారిలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ విషయమై కాళేశ్వరం పోలీసులను, టీఎస్‌ఎండీసీ అధికారులను అడిగితే తమకేమీ సంబంధం లేదని జవాబిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

మహారాష్ట్రలో పేలిన ఐఈడీ బాంబు

ఇద్దరు జవాన్లకు స్వల్ప గాయాలు

మహదేవపూర్, జూలై 6: మండలానికి ఆనుకొని గోదావరి అవతలి వైపు ఉన్న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టులు పెట్టిన ఐఈడీ బాంబు పేలడంతో ఇద్దరు జవాన్లకు స్వల్ప గాయాలయ్యాయి. శనివారం భామ్రాగఢ్ వంతెన ప్రాంతంలో సీ60 బలగాలు కూంబింగ్‌కు వెళ్లగా క్లైమోర్ మైన్ పేల్చడంతో ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. బాంబు పేల్చిన వారి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

ఏఐఏఎస్ జిల్లా కోఆర్డినేటర్‌గా పోచయ్య

కాటారం, జూలై 6: ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం(ఏఐఏఎస్) జిల్లా కో-ఆర్డినేటర్‌గా మండలంలోని గారెపల్లికిచెందిన పొట్ట పోచయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు నియామక పత్రం శనివారం జారీ చేయగా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి లింగాల రామయ్య పోచయ్యకు అందజేశారు. జిల్లాలో దళితుద్యమకారులు, ఏఐఏఎస్ సభ్యులు, విద్యార్థిసంఘాలతో కలిసి సంఘాన్ని పటిష్టం చేయాలని, జిల్లా కార్యవర్గ నియామకం చేపట్టాలని నియామక పత్రంలో సూచించారు.

ఆర్టీసీ బస్సు ఆపడం లేదంటూ ఆందోళన

జాతీయ రహదారిపై బైఠాయించిన మహిళలు

కృష్ణకాలనీ, జూలై 6: ఆర్టీసీ బస్సు ఆపడం లేదంటూ ఆగ్రహానికి గురైన మహిళలు రోడ్డుపై బైఠాయించారు. భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామంలో హనుమకొండ నుంచి భూపాలపల్లి, భూపాలపల్లి నుంచి హనుమకొండకు వెళ్లే బస్సులు ఆపడం లేదంటూ గ్రామ మహిళలు శనివారం రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. బస్సులు ఆపేలా అధికారులు చొరవ చూపేంతవరకు ఆందోళన విరమించమని భీష్మించి కూర్చున్నారు. దీంతో జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న భూపాలపల్లి ఎస్సై సుధాకర్ సిబ్బందితో చేరుకుని వారిని సముదాయించారు. అయినప్పటికీ వినకపోవడంతో ఆర్టీసీ డీఎంతో మాట్లాడి హామీ ఇవ్వగా ఆందోళన విరమించారు. అర్ధగంట పాటు వాహనాలు నిలిచిపోగా పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

నేడు రాజుపేటలో మెగా వైద్య శిబిరం

మంగపేట, జూలై 6 : మండలంలోని రాజుపేట జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో ఆదివారం మంత్రి ధనసరి సీతక్క జన్మదినం సందర్భంగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కర్రి నాగేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో రాజుపేట సర్కిల్ పరిధిలోని ప్రజలకు హనుమకొండలోని భగీరథ కార్డియా కేర్ సెంటర్ వారు ఉచితంగా వైద్య పరీక్షలు చేయనున్నట్ల చెప్పారు. గుండెకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భూపాలపల్లిటౌన్, జూలై 6 : విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ విశ్వాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మంజూర్‌నగర్‌లో 11కేవీ లైన్‌పై చెట్లు కొట్టడం, విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందన్నారు. కాగా పట్టణంలోని మంజూర్ నగర్, బీసీ కాలనీ, జవహర్‌కాలనీ, మైసమ్మగుడి ఏరియా, 5 ఇంక్లైన్ ప్రాంతం, ఫుల్లూరిరామయ్యపల్లి, జీఎంఆర్ వెంచర్, టీసీ కాలనీ, వెంగళరావు కాలనీ, కుందూరుపల్లి, మాధవరావుపల్లి వాసులు సహకరించాలని ఆయన కోరారు.

సర్టిఫికెట్లను అందించిన సామాజిక కార్యకర్త

గోవిందరావుపేట, జూలై 6 : మండలంలోని పస్రా హైస్కూల్‌లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థి సల్లూరి దిలీప్ ఇటీవల గోవిందరావుపేట బస్టాండ్‌లో టీసీ, స్టడీ సర్టిఫికెట్లు మరిచిపోయాడు. గమనించిన మండల సామాజిక కార్యకర్త తుమ్మల రామకృష్ణ సర్టిఫికెట్లు ఉన్న కవర్‌ను తీసుకుని దిలీప్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు శనివారం దిలీప్ తండ్రి రమేష్‌కు సర్టిఫికెట్లు అందజేయడంతో రామకృష్ణను గ్రామస్థులు అభినందించారు.

ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

మంగపేట, జూలై 6 : ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలందరు విధిగా ఆరోగ్య సూత్రాలను పాటించి అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్ కుమార్ సూచించారు. శనివారం మండలంలోని రాజుపేటలో వైద్య శిబిరం నిర్వహించగా వైద్యాధికారి మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నపిల్లలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, ఇతర సమస్యలు ఉన్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పొదెం రవి, ఏఎన్‌ఎం అరుణ, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

రేగులగూడెంలో మహిళ ఆత్మహత్య

భర్త మద్యానికి బానిసై గొడవ చేస్తున్నాడని మనస్తాపం

కాటారం, జూలై 6: మద్యానికి బానిసైన భర్త దుబారా ఖర్చు చేస్తుండటంతో పాటు తరచూ గొడవ చేస్తుండటంతో మనస్తాపానికి గురైన ఓ ఇల్లాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని రేగులగూడెంలో చోటుచేసుకుంది. ఎస్సై అభినవ్, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. రేగులగూడెంకు చెందిన పెర్క రవి, లావణ్య(35) దంపతులకు కుమారుడు, కూతురున్నారు. రవి ఆటో నడుపుతుండగా లావణ్య కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత కొంతకాలంగా మద్యానికి బానిసైన రవి ఆటోను సక్రమంగా నడిపేవాడు కాదు. తరచూ లావణ్యతో గొడవ పడుతుండేవాడు. ఈనెల 4వ తేదీ రాత్రి వాకిటి దేవరకు యాటపోతు బలివ్వడానికి రవి మేకను తెచ్చాడు. బంధువులను పిలుచుకుని తర్వాత చేద్దామని లావణ్యచెప్పినా వినకుండా మద్యం మత్తులో గొడవ పడ్డాడు. దీంతో లావణ్య భర్త మారడని మనస్తాపం చెంది శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో భర్త రవి, చుట్టుపక్కల వారు అంబులెన్స్‌లో భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉందని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేశారు. దీంతో లావణ్యను ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. లావణ్య అత్త రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.


సింగరేణి కార్మికులు బాధ్యతగా పనిచేయాలి : జీఎం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎం హబీబ్ హుస్సేన్

కాకతీయఖని, జూలై 6 : సింగరేణి కార్మికులు బాధ్యతగా పనిచేయాలని ఏరియా జనరల్ మేనేజర్ సయ్యద్ హబీబ్ హుస్సేన్ అన్నారు. శనివారం భూపాలపల్లి ఏరియాలోని రెస్క్యూ స్టేషన్‌లో గైర్హాజరు కార్మికులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. 100 మస్టర్ల లోపు ఉన్న కార్మికులను 69 మందిని కౌన్సిలింగ్‌కు పిలువగా 26 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ పలువురు కార్మికులు విధులకు అకారణంగా గైర్హాజరవుతూ భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారని అన్నారు. చిన్నచిన్న కారణాలతో డ్యూటీలకు డుమ్మా కొట్టడం వలన వారి కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయన్నారు. కారుణ్య నియామకం ద్వారా ఎంపికైన కార్మికులు అధికంగా గైర్హాజరవుతున్నారని తెలిపారు. సమస్యలు ఏమైనా విధులకు సక్రమంగా హాజరై కుటుంబ రక్షణకు, సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై 5 వరకు 32 మంది కార్మికులు ఒక్క మస్టర్ కూడా పడలేదు. ఇందులో 12 మంది కేటీకే-8వ గని కార్మికులు, కేటీకే-1గని 11 మంది కార్మికులు, కేటీకే-5వ గనిలో 7 మంది కార్మికులు, కేటీకే-6వ గని కార్మికులు ఇద్దరు జీరో మస్టర్లు ఉన్నారు.

బొగ్గు గనులు సింగరేణికి కేటాయించాలి : ఏఐటీయూసీ



జీఎం కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కాకతీయఖని, జూలై 6: కేంద్ర ప్రభుత్వం సింగరేణి బొగ్గు బావుల వేలాన్ని విరమించుకుని బొగ్గు బ్లాకులను సంస్థకు కేటాయించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం భూపాలపల్లి ఏరియాలోని జీఎం కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ముఖ్య అతిథిగా రాజ్‌కుమార్ హాజరై దీక్షలో కూర్చున్న కార్మికుల మెడలో పూలమాల వేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ పరిరక్షణకు అందరు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర బొగ్గు గనుల వేలాన్ని విరమించే వరకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, తదితర పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు తమతో కలిసి నిరసనలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంచందర్, విజేందర్, సతీష్, సుధాకర్‌రెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.